క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో బయోటెక్నాలజీ గెస్ట్ లెక్చరర్ పోస్టును ఇంటర్వ్యూ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మాధవి గురువారం తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీలో 55 శాతం మార్కులు సాధించాలని, యూజీసీ, సెట్, పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. వచ్చే నెల 2వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీ



గుడివాడటౌన్: సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు రోటరీక్లబ్ క్లబ్ అధ్యక్షుడు టీఎన్ రాజశేఖర్ గురువారం తెలిపారు. ఈనెల 1వ తేదీన నిర్వహించిన వైద్యశిబిరంలో భాగంగా కంటి వైద్యుడు పి.విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో కళ్లజోళ్లు అవసరమైన వారికి క్లబ్ సభ్యులు వై.నాగేశ్వరరావు వితరణతో కళ్లజోళ్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కిరణ్‌బాబు, ప్రెసిడెంట్ ఎలక్ట్ వై.నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



గుడివాడటౌన్: ఉమ్మడి కృష్ణాజిల్లా బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ – 2024 పోటీల్లో గుడివాడ ఫిట్‌జోన్ జిమ్ బిల్డర్‌లు తమ ప్రతిభను చూపి పతకాలు సాధించారని జిమ్ నిర్వాహకుడు మహ్మద్ సైదా గురువారం తెలిపారు. విజయవాడలో ఆదివారం జరిగిన పోటీల్లో 70 కిలోల విభాగంలో ఎస్.దిలీప్ రజిత, 75 కిలోల విభాగంలో ఎం.నాగబాబు రజిత, 80 పైబడి విభాగంలో వి.తరుణ్‌కుమార్ ప్రోత్సాహక బహుమతులు పొందారన్నారు. బిల్డర్‌లను గురువారం సత్కరించారు. డాక్టర్ ఎం.రవి, గంటా సురేష్, ఎల్.శ్యామ్ పాల్గొన్నారు.

విజేతలకు అభినందన



గుడివాడటౌన్: స్కేటింగ్ హాకీలో తమ విద్యార్థులు జాతీయ పతకాలు సాధించారని గౌతమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. స్కూల్ ఆవరణలో పతకాలు సాధించిన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు కోయంబత్తూరులో జరిగిన 62వ నేషనల్ రోలర్ అండ్ ఇన్‌లైన్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థిని పి.కారుణ్య క్యాడిట్ బాలికల విభాగంలో రజిత, మిక్స్‌డ్ టీమ్‌లో కాంస్య పతకం, పి.వన్షిక రజిత పతకం, జూనియర్ బాలికల విభాగంలో ఎ.నిఖిల కాంస్య పతకం సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ పీఎన్‌వీఎస్ అయ్యప్పలను ప్రిన్సిపాల్స్ ఎం.సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి అభినందించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆకస్మిక తనిఖీలు



గుడివాడటౌన్: గుడివాడ ఆర్టీసీ డిపోను విజయవాడ జోన్ – 2 డెప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.వెంకట్రావు గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. డిపో గ్యారేజీలోని బస్సుల పనితీరును పరిశీలించి మెకానిక్‌లతో మాట్లాడారు. బస్సుల సర్వీసుల వివరాలను డిపో మేనేజర్ డి. రాజేష్ ఆయనకు వివరించారు. వెంకట్రావు మాట్లాడుతూ.. బస్సుల కండిషన్‌లో చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా పెనునష్టం తప్పదన్నారు. బస్సుల మరమ్మతుల విషయమై సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. డిపో పరిధిలోని బస్సుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. డిపో ఉద్యోగులు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

మండల వీఆర్వోల సంఘాధ్యక్షుడిగా ప్రకాష్



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల వీఆర్వోల సంఘాధ్యక్షుడిగా శాయన మహంకాళి ప్రకాష్‌ను గురువారం రాత్రి వీఆర్వోలు ఎన్నుకున్నారు. ఆ సంఘ ఉపాధ్యక్షుడిగా గొర్ల వేణుగోపాలస్వామి, కార్యదర్శిగా గురజ నరసింహారావు, జాయింట్ సెక్రటరీగా బలే నాగరాజు, కోశాధికారిగా సనకా భాస్కరరావు, మల్లిఖార్జునరావు, గౌరవాధ్యక్షుడిగా కొమరవోలు వెంకటేశ్వరరావు, పురిటిపాటి రవి శరత్‌కుమార్ ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

టీకాలతో ఆరోగ్యానికి రక్ష

- నవరించిన టీకాల షెడ్యూల్ అమలు
- గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు
- ప్రతీ బుధ, శనివారాల్లో ఉచితంగా వ్యాక్సినేషన్
- టీకాలు తప్పనిసరిగా వేయించాలంటున్న వైద్యులు



వేమవరప్పాడులో శిశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

కైకలూరు: పుట్టిన పసిబిడ్డ నుంచి 16 సంవత్సరాల ప్రాయం వరకు వ్యాధి నిరోధక టీకాలు జీవితాన్ని ఆరోగ్యవంతం చేస్తాయి. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ 2023 జనవరి ఒకటి నుంచి సవరించిన టీకాల షెడ్యూల్‌ను అమలు చేస్తోంది. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సిబ్బంది ప్రతి బుధ, శనివారాల్లో గర్భిణులు, చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరికి అవగాహన లేకపోవడంతో క్రమం తప్పకుండా వేయాల్సిన టీకాలను అశ్రద్ధ చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను అధునాతన భవంతులలో ఏర్పాటు చేశారు.

సీహెచ్‌సీ, పీహెచ్‌సీల వివరాలు

నియోజకవర్గంలో కైకలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)తో పాటు శీతనపల్లి, కొల్లేటి కోట పీహెచ్‌సీలు, కలిదిండి మండలంలో కలిదిండి, కోరుకొల్లు, మూలలంక, మండవల్లి మండలంలో మండవల్లి, తక్కెళ్లపాడు, ముదినేపల్లి మండలంలో ముదినేపల్లి, గురజ, దేవపూడి పీహెచ్‌సీలు ఉన్నాయి. అదే విధంగా సచివాలయ పరిధిలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణులు, తల్లులకు గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.

వ్యాక్సిన్లు వేసేది ఇలా..

- గర్భిణిగా నిర్ధారణై మూడు నెలలు నిండిన తర్వాత టీటీ ఇంజెక్షన్ వేయించుకోవాలి. నెల వ్యవధిలో మరో టీటీ ఇంజెక్షన్‌తో పాటు ఐరన్, ఫోలిక్, కాల్షియం టాబ్లెట్లు ఇస్తారు. ప్రసవం అనంతరం ఐరన్ టాబ్లెట్లు ఇస్తారు.
- అప్పుడే పుట్టిన చిన్నారికి 24 గంటల వ్యవధిలో పోలియో చుక్కలు, హెపటైటిస్-బి డోసు వేయించాలి. వీటి వల్ల పోలియో, పచ్చకామెర్ల వ్యాధి నుంచి రక్షణ లభిస్తుంది.
- పుట్టిన ఆరు వారాలలోపు ఓపీవీ-1, పెంటావాలెంట్-1, రోటా-1, ఎఫ్ఐపీవీ-1 అందించాలి.
- చిన్నారులకు 14 రోజుల వ్యవధిలో టీబీ రాకుండా బీసీజీ టీకా వేయించాలి.
- 6, 14 వారాల్లో ఐపీవీ చుక్కలు వేయించాలి. వీటితో పాటు 6, 10, 14 వారాల వ్యవధిలో పోలియో చుక్కలు, పెంటా వాలెంట్ వేయించాలి. వీటి వలన కోరింత దగ్గు, కంఠసర్పి, ధనుర్వాతం, మొదడువాపు, పచ్చకామెర్ల వంటి వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవచ్చు.
- 9 నుంచి 12 నెలల వ్యవధిలో తట్టు వ్యాధి రాకుండా మీజిల్స్, కంటి, చర్మ వ్యాధులు రాకుండా విటమిన్-ఏ ఓపీని వేయించుకోవాలి. ఐదేళ్లు పూర్తయిన తర్వాత, టీపీటీ డోసు వేయించాలి.
- తొమ్మిది నెలల నుంచి ఐదేళ్ల వయసు వరకు ప్రతీ ఆరు నెలలకోసారి విటమిన్-ఏ చుక్కలు మొత్తం తొమ్మిది డోసులు వేయించాలి.
- 10, 16 సంవత్సరాలు పూర్తయితే టెట్నాస్(టీటీ) వేయించాలి.

ఆరోగ్యకర జీవితానికి టీకాలు..



ఆరోగ్యకర జీవితాన్ని అందించడంలో టీకాల పాత్ర కీలకం. అత్యంత ఖరీదైన టీకాలను సైతం వైద్య ఆరోగ్యశాఖ ఉచితంగా అందిస్తుంది. పుట్టిన బిడ్డ నుంచి 16 సంవత్సరాలు పూర్తయ్యే వరకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది గ్రామీణ స్థాయిలో టీకాలను షెడ్యూల్ ప్రకారం వేస్తుంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు టీకాలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ అన్నపూర్ణ, శీతనపల్లి పీహెచ్‌సీ, కైకలూరు

అవగాహన కల్పిస్తున్నాం..



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో టీకాలపై ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తున్నాం. కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నాం. టీకాలు మానవ జీవితంలో కీలకంగా ఉంటాయి. ఆరోగ్యకర జీవితానికి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. గ్రామీణ ప్రాంతాల్లో టీకాలపై అవగాహన పెరిగింది. ప్రతీ ప్రభుత్వాస్పత్రిలో బుధ, శనివారాల్లో టీకాలు వేస్తారు.

– డాక్టర్ శంకర్, కొల్లేటికోట పీహెచ్‌సీ,కైకలూరు

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ



గుడ్లవల్లేరు: చిరు వ్యాపారులకు నీడ కల్పించేందుకు లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యాన గొడుగుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. నందిగామకు చెందిన లయన్స్ ప్రతినిధి యర్రంరెడ్డి గాంధీ ఆర్థిక వితరణతో గొడుగులు అందజేశారు. లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ, లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వైపీసీ ప్రసాద్, లయన్స్ ప్రతినిధులు పెరుమాళ్లు, నవాబు, చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ టెలిఫోన్ బ్రోచర్ ఆవిష్కరణ



గుడివాడటౌన్: విలేకరుల సమాచారం పారదర్శకంగా ఉండటం వలన నకిలీ విలేకరుల బెడద తప్పుతుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం ఆయన నివాసంలో గుడివాడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల టెలిఫోన్ నంబర్ల బ్రోచర్‌ను ఎమ్మెల్యే రాము ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు గూడపాటి రాజు, ఎండీ జబీబుల్లా, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడరూరల్: రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ వాసిరెడ్డి రామ కోటేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని పెద ఎరుకపాడులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహపురంలో సదస్సు

నందివాడ: మండలంలోని ఇలపర్రు గ్రామపంచాయతీ లక్ష్మీనరసింహపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గురువారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. ప్రజల నుంచి భూ సమస్యల అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే రాము సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం శాఖపరమైన చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి, అమీర్ బాషా, ఆర్ఐ గణేష్, మండల పార్టీ అధ్యక్షులు సన్యాసిరావు, చాట్రాగడ్డ రవి, సర్పంచ్ మరియమ్మ, ఎంపీటీసీ రంగమ్మ, ప్రభాకర్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమార్కుల చెరలో దళితుల భూములు...

గుడ్లవల్లేరు: విన్నకోటలో 20 ఎకరాల పైబడి దళితుల అసైన్డ్ భూములు అక్రమార్కుల చెరలో ఉన్నాయని సంఘ సేవకుడు గాలంకి నాగేంద్రం తహసీల్దార్ బి.లోకరాజుకు ఫిర్యాదు చేశారు. గురువారం విన్నకోట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. రీ సర్వే అనంతరం ఈ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని అధికారులు చెప్పినా.. కొంతమంది అధికారుల ప్రోద్బలంతో ఆ కబ్జాదారులే ఎస్సీల భూముల్ని అనుభవిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే స్థానికంగా ఉన్న వ్యక్తిగత రెవెన్యూ సమస్యలపై అర్జీదారులు ఫిర్యాదు చేశారు. మండల ప్రత్యేకాధికారి గుమ్మా రమేష్, ఆర్ఐ పి.శివకుమార్, మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలి

ముదినేపల్లిరూరల్: రైతుల శ్రేయస్సుకు నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జేఎస్ సుభానీ అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో రెవెన్యూ గ్రామ సభ గురువారం నిర్వహించారు. పలు సమస్యలపై రైతులు అర్జీలను అందజేశారు.

బొడ్డపాడులో రెవెన్యూ గ్రామ సభ

పామర్రు: తోట్లవల్లూరు మండలం బొడ్డపాడు గ్రామంలో గ్రామ సర్పంచ్ మూడే శివ శంకర్ అధ్యక్షతన గురువారం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. ఈ సభలో గ్రామానికి సంబంధించి రెవెన్యూ సమస్యలను గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, డెప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, వీఆర్వో నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సామర్థ్యాల మదింపునకు సమ్మేటివ్ పరీక్షలు

పామర్రు: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మదింపునకు విద్యా శాఖ ఐదు నెలలకు ఒకసారి సమ్మేటివ్-1 పరీక్షలు నిర్వహిస్తుందని డీసీఈబీ సెక్రటరీ ఎస్‌కే జాన్‌సాహెబ్ అన్నారు. స్థానిక ఎంఈవో-2 పద్మవాణితో కలిసి పామర్రు జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఏ-1 పరీక్ష కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలను ఏవిధమైన ఇబ్బందులు లేకుండా నిర్వహించాలన్నారు. పరీక్ష సమయంలో విద్యార్థులకు అన్ని రకాల వసతులను కల్పించాలని ఆదేశించారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలన్నారు. సీబీఎస్‌ఈ సిలబస్ నుంచి స్టేట్ సిలబస్‌కు మార్చిన తర్వాత నిర్వహిస్తున్న ఈ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ నెల 16న జరగాల్సిన పరీక్షను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం ఇందిరా రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారులను సత్కరించిన స్టేడియం కమిటీ



క్రీడాకారులను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

గుడివాడటౌన్: రోలర్ హాకీ 62వ జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ క్రీడాకారులు పతకాలు సాధించారని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకు కోయంబత్తూరులో జరిగిన పోటీల్లో స్టేడియం క్రీడాకారులు వి.ఆషిక, కె.కారుణ్యశ్రీ, జి.దివిషలు రాష్ట్రం తరుపున పోటీల్లో పాల్గొని వెండి పతకం, వి.ఆషిక, కారుణ్యశ్రీ క్యాడిట్ మిక్స్‌డ్ విభాగంలో కాంస్య పతకం సాధించారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్ వి.రాజాలను స్టేడియం కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సంయుక్త కార్యదర్శి కె.రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

కైకలూరు: నియోజకవర్గంలో అన్ని మండలాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని కైకలూరు టౌన్, రూరల్ సర్కిల్ సీఐలు పి.కృష్ణ, వి.రవికుమార్ అన్నారు. సర్కిల్ పోలీసు స్టేషన్‌లో నాలుగు మండలాల్లోని గ్రామ సంరక్షణ మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐలు మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా10 మంది పోలీసుల నిఘాతో సమానమన్నారు. కేసు దర్యాప్తులో వీటి ఉపయోగం ఎంతో ఉందన్నారు. ఎస్ఐలు వి.రాంబాబు, సీహెచ్.రామచంద్రరావు, వీరభద్రం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు



మండవల్లిలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

మండవల్లి: ఆలయాల్లో ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీదత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వెళ్లి భిక్ష స్వీకరించారు. 20న ఐదో రోజు వెలంపేట రామాలయం, కైకలూరు వీధిల్లో నగర సంకీర్తన నిర్వహిస్తామని గుడివాడ చిట్టిబాబు పేర్కొన్నారు. బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయాల్లో విశేష పూజలు

కొరిమెర్ల(పామర్రు): మండల పరిధి కొరిమెర్ల గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం పూజలను ఆలయ అర్చకులు బృందావనం భార్గవాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు బాలభోగాన్ని ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండల పరిధి జమీదగ్గుమిల్లి, రాపర్ల, పామర్రు గ్రామంలోని విష్ణాలయాల్లో పూజలను చేపట్టారు. తొలుత మంగళవాయిద్యాలతో స్వామివారిని మేల్కొలిపి మంత్ర జాలలతో గోదాదేవికి విశేష అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తిరుప్పావై పఠనం చేసి, వాటి తెలుగు అర్థాన్ని ప్రవచించారు.


అంతర్జాతీయ స్థాయి అబాకస్‌లో రాణింపు



ట్రోఫీతో విద్యార్థిని చార్విక

గుడ్లవల్లేరు: అబాకస్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని గొట్టిపాటి చార్విక అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించిందని గుడ్లవల్లేరు ఏపీ ఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి తెలిపారు. గురువారం పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గత వారం ఢిల్లీ విశ్వవిద్యాలయంలో యూకేఎంఏఎస్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి అబాకస్, మెంటల్ అర్థమెటిక్ ఈవెంట్‌లో చార్విక పాల్గొని ఎలిమెంటరీ బీ ఇంటర్నేషనల్ విభాగంలో 3వ రన్నర్ అప్‌గా, ఎలిమెంటరీ బీ నేషనల్ విభాగంలో మెరిట్ ట్రీజ్ విన్నర్‌గా విజయం సాధించినట్లు చెప్పారు. విజేత చార్వికను, ఆమె తల్లిదండ్రులు గొట్టిపాటి రామకిశోర్, నాగలక్ష్మిని హైస్కూల్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వరరావు వల్లూరుపల్లి, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, ఉపాధ్యక్షుడు కొడాలి వెంకట కృష్ణారావు, ప్రిన్సిపాల్ సాతులూరి లీనా అభినందనలు తెలిపారు.

గ్రీవెన్ సెల్‌లో అర్జీల స్వీకరణ



పామర్రు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్ సెల్‌ను స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలోఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రజలు వారి వారి సమస్యలను అర్జీల రూపంలో ఈ సెల్‌లో అందజేయాలన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వి.గణేష్, కె.ప్రవీణ్‌చంద్ర, సందీప్, పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి వ్యాఖ్యలపై నిరసన



పామర్రులో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రసాద్, నాయకులు

పామర్రు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెగ్గం ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో అత్యున్నత రాజ్యాంగం, ప్రజాస్వామ్య దేశం భారత దేశమన్నారు. అలాంటి దేశానికి రాజ్యాంగం రాసిన అంబేడ్కర్‌పై ఒక బాధ్యతాయుతమైన ప్రభుత్వంలో ఉండి వ్యాఖ్యలు తగదని చెప్పారు. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించ బడిన హక్కుల ద్వారా పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా ఉంటూ అంబేడ్కర్‌ను అవమానకంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి ఎస్సీ ఎస్టీకేసును నమోదు చేసి, అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలన్నారు. భారత ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని, ఈ దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి భాను, మద్దుల సుబ్రహ్మణ్యేశ్వరరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి...

గుడ్లవల్లేరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో కించపరచిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని సంఘ సేవకుడు గాలంకి నాగేంద్రం డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమిత్ షా చేసిన వ్యాఖ్యలు పెద్ద చారిత్రాత్మక తప్పిదమన్నారు. అలాగే గుడ్లవల్లేరు దళిత నాయకుడు డాక్టర్ గోట్రు నాగబాబు మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి బీజేపీ వ్యతిరేకమని, మరోసారి అంబేడ్కర్‌పై వ్యాఖ్యలతో అమిత్ షా నిరూపించారన్నారు. అమిత్ షా క్షమాపణ చెప్పకపోతే బీజేపీకి రాబోయే రోజుల్లో గడ్డు కాలమేనని హెచ్చరించారు.

చవితి నాటికి భూ సమస్యల పరిష్కారం




కలిదిండిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని, ఆర్డీవో అచ్యుత అంబరీష్ తదితరులు

కలిదిండి(కైకలూరు): వినాయక చవితి పండుగ నాటికి నియోజకవర్గంలో భూ సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డులో నియోజకవర్గం నాలుగు మండలాల్లో భూ సమస్యలపై ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ గురువారం చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కలిదిండి మండలంలో మిలటరీ భూములు మొత్తం 1,899 ఎకరాలు 22ఏలో ఉన్నాయని వాటిని వెంటనే తొలగిస్తామన్నారు. ఉనికిలి, వాడాలి, వైవాక, భాస్కరరావుపేటలోని అసైన్డ్ భూములు, కలిదిండి మద్దాల శ్రీ రంగనాథ నాయకులకు సంబంధించిన భూముల సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు.

వైద్య సేవలతో ప్రజలు సంతృప్తి చెందాలి

కైకలూరు: రోగులకు వైద్యులు చేసే సేవలపై పూర్తి స్థాయి సంతృప్తి వ్యక్తమైతే చిరస్థాయిగా గుర్తుంటారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) అభివృద్ధి కమిటీ సమావేశం కామినేని అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ అల్లాడి శ్రీనివాసరావు అజెండాను చదివి వినిపించారు. డీఎల్‌హెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ ఆరోగ్యశాఖ నుంచి అందించే సేవలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి కమిటీ సభ్యులుగా పునుకొల్లు వెంకటరమణ, తానా వెంకట ప్రసాదరావు, ఎం.వెంకట శ్రీనివాసరావులను నియమించామన్నారు. త్వరలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను తీసుకువచ్చి పలు అభివృద్ధి పనులను చేపడతామన్నారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నేతలు వీరమల్లు నరసింహారావు, జోగిరాజు, తాడినాడ బాబు, వల్లభనేని శ్రీనివాసచౌదరి, నున్న రమాదేవి, చలపతి, త్రినాథరాజు, కొల్లి బాబీ, ప్రసాదరాజు, రహీం, జానీ పాల్గొన్నారు.

శతాధిక కవి సమ్మేళనంలో బెనర్జీ దండేకు సన్మానం



కైకలూరు: స్థానిక ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు దండే బెనర్జీ శతాధిక కవి సమ్మేళనంలో ప్రముఖులతో సత్కారం పొందారు. కర్నూలు జిల్లా మంత్రాలయంలోని పరిమళ విద్యానికేతన్ ఆడిటోరియంలో ఇటీవల నిర్వహించిన ఐఎస్ఓ సర్టిఫైడ్ శ్రీశ్రీ అంతర్జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో 'దేశమా మేలుకో'అను శీర్షికతో కవితా గానం బెనర్జీ చేశారు. వీటితో పాటు పలు అంశాలపై ఆలోచనాత్మక కవితా గానం చేశారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ఈశ్వరి భూషణం, పార్థసారథి కర్నూలు నిర్వాహక కమిటీ ఘన సన్మానించింది. బెనర్జీని సహోపాధ్యాయులు, స్థానిక సాహితీవేత్తలు అభినందించారు.